క్లుప్తంగా

ఘనంగా శ్రీపుష్పయాగం



సీతారామచంద్రస్వామి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో గత నెల 30 నుంచి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున సాయంత్రం 6 గంటలకు స్వామికి ద్వాదశ ప్రదక్షిణలు, సర్వలోప ప్రాయశ్చితం నిర్వహించారు. అనంతరం శ్రీపుష్పయాగం, పవళింపు సేవ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'తిల్లానాలు'పై సంగీత శిక్షణ



వంకాయల వెంకటరమణమూర్తిని సత్కరిస్తున్న మండపాక శారద

సీతంపేట: పద్మ విభూషణ్, సంగీత కళానిధి డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచించిన తిల్లానాలుపై విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ మండపాక శారద ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సంగీత శిక్షణ శిబిరం జరిగింది. అహిర్ భైరవి, కుంత వరాళి, కదన కుతూహలం, బేహాగ్ రాగాల్లో తిల్లానాలు నేర్పారు. మృదంగ విద్వాంసుడు వంకాయల వెంకటరమణమూర్తికి బెనారస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా అకాడమీ తరఫున ఆయనను శారద సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవాధ్యక్షుడు ఎం.ఎస్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ నాగలక్ష్మి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమా నీలకంఠేశ్వరాలయంలో భారీ అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈవో శేఖర్‌బాబు తదితరులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయ ఈవో శేఖర్‌బాబు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో చైర్మన్ అప్పలరెడ్డి, అర్చకులు రామారావు శర్మ, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

మద్దిలపాలెం: విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు క్రీడాంశాలు నేర్పించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల అభిరుచులు, వారి ఆశయాలను తెలుసుకోవడానికి ఇటువంటి శిబిరాలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సచివాయల సిబ్బంది, జీవీఎంసీ స్పోర్ట్స్ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆహా ఏమి రుచి.. అనరా మైమరచి

- ఆదివారం మీనాబజార్ అదుర్స్
- కళకళలాడిన ఫిషింగ్ మార్కెట్
- చేపల కొనుగోలుకు పెద్ద ఎత్తున తరలి వచ్చిన జనం



నోరూరించే వివిధ రకాల చేపలు

దాబాగార్డెన్స్: నాన్‌వెజ్‌ప్రియులకు ఆదివారం వచ్చిందంటే పండగే. సోమవారం నుంచి శనివారం వరకు బిజీబిజీగా ఉండే వారు.. ఎప్పుడు ఆదివారం వస్తుందా..అని ఆత్రుతగా ఎదురు చూస్తుంటారు. శనివారం రాత్రి నుంచే ఆదివారం కోసం ప్రణాళిక వేసుకుంటారు. ఎలాగూ సెలవు కావడంతో.. ఉదయాన్నే నిద్ర లేవడం. ఆపై మార్కెట్లకు పరుగులు తీయడం మొదలు.. పొద్దుపోయే వరకు ఇంటిల్లిపాదీ సరదాగా గడుపుతుంటారు. అధిక శాతం మంది నాన్‌వెజ్ ప్రియులు.. కోడి.. మేక మాంసం కన్నా చేపలకు ప్రాధాన్యత ఇస్తుంటారు. అందుకే ఉదయాన్ని అనేక మంది ఫిషింగ్ హార్బర్‌కు పరుగులు తీస్తారు. అక్కడ సముద్ర చేపలతో పాటు పీతలు, రొయ్యలు విరివిగా లభిస్తుంటాయి.

ట్యాంక్‌ఫిష్‌కు ప్రాధాన్యత..
మరికొంత మంది ట్యాంక్ ఫిష్ (చెరువు చేపలు) కోసం ఎదురు చూస్తుంటారు. నిత్యం సముద్ర చేపలు తిన్నవారు చెరువు చేపల కోసం ఆశ పడుతుంటారు. అలాంటి వారి కోసం విశాఖ జిల్లాలో గల పలు చెరువుల నుంచే గాక తూర్పు గోదావరి, కాకినాడ, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి చెరువు చేపలు, గోదారి చేపలను ఆదివారం వేకువ జామునే నగరానికి తీసుకొస్తుంటారు. పెద్ద ఎత్తున చెరువు చేపలు, రొయ్యలు, పీతలు తీసుకొచ్చి నగరంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ప్రహరీకి ఆనుకొని విక్రయిస్తుంటారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రహరీకి ఆనుకొని ఉన్న చేపల మార్కెట్‌కు విరివిగా తీసుకొస్తుంటారు. చెరువు చేపల విషయానికొస్తే.. కేజీ బంగారు చేప రూ.200 పైబడి విక్రయిస్తుంటారు. కేజీ బొమ్మిడాలు రూ.వెయ్యి, పీతలు కేజీ రూ.300, రొయ్యలు కేజీ రూ.300 నుంచి రూ.400 ఇలా పలు రకాల చేపలు అధిక ధరలకు విక్రయాలు జరిగాయి.



ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వద్ద చెరువు చేపల విక్రయాలు

జోరుగా ఎండుచేపల విక్రయాలు..
ఇదిలా ఉండగా..ఫిషింగ్ హార్బర్‌లో వేట విరామ సమయం కావడంతో సముద్ర చేప పెద్దగా లేకపోవడంతో ఎండుచేపల విక్రయాలు జోరుగా సాగాయి. కేజీ ఎండు నెత్తళ్లు రూ.600 పలికింది. కేజీ ఎండు రొయ్యలు రూ.500, ఎండు చావడి రూ.300, కేజీ ఎండు రొయ్య పొట్టు రూ.500 ఇలా ఎండు చేపలు, రొయ్యల విక్రయాలు జరిగాయి. ముఖ్యంగా ఫిషింగ్ హార్బర్‌కు వచ్చిన పర్యాటకులు ఎండు చేపలు కొనుగోలు చేశారు. ఇక్కడ వేట విరామ సమయంతో పాటు అన్ని సీజన్లలోనూ చేపల కొనుగోలుకు జనం విపరీతంగా వస్తుంటారు. వీధుల్లోకి వచ్చి అమ్మేవారి కంటే వీరి వద్ద తాజా చేపలు దొరుకుతుండడంతో ఎక్కడెక్కడి నుండి వినియోగదారులు ఫిషింగ్ మార్కెట్‌కు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. బయటి మార్కెట్ల కంటే ఫిషింగ్ హార్బర్‌లో తాజా చేపలు తక్కువ ధరకు దొరకడమే దీనికి కారణం.



ఫిషింగ్ హార్బర్‌లో జోరుగా ఎండు చేపల విక్రయాలు

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ



వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ విశాఖ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ నేతృత్వంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ సమీపాన గల సెయింట్ జోసెఫ్ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి తుల్లి చంద్రశేఖర్, బొడ్డేటి ప్రసాద్, రంధి గోపి, కర్రి నీలకంఠం, బొండాడ వెంకట్రావు, ప్రధాన శత్రువు, మామిడి మోహన్, శ్రీనివాసరెడ్డి, గండి అప్పలరాజు, డొప్ప సూరిబాబు, రామశెట్టి కిరణ్, ఇళ్లపు శ్రీను, మజ్జి అప్పలరాజు, కొండబాబు, ఉమామహేష్, వద్దాది శివ, రమణ, సూరిబాబు, వంశీ, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదం పట్ల కాంగ్రెస్ దిగ్భ్రాంతి



రైలు ప్రమాద మృతులకు సంతాపం తెలియజేస్తున్న గ్రంథాలయం సభ్యులు

దాబాగార్డెన్స్: ఒడిశా రైలు ప్రమాదం పట్ల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట వాసుదేవరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు కనీసం రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.15 లక్షలు తక్కువ కాకుండా నష్టపరిహారం అందజేయాలన్నారు.

సంతాపం..
అల్లిపురం: రైలు ప్రమాదంలో అశువులు బాసిన వారికి వెంకటేశ్వరమెట్టలోని శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం సభ్యులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీను మాట్లాడుతూ శుక్రవారం రాత్రి బాలాసోర్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 300కు ప్రయాణికులు అశువులు బాయటం విచారకరమన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ గ్రంథాలయ సభ్యులు ఆదివారం సమావేశమై కొంత సేపు మౌనం పాటించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, వెంకటేశ్వరమెట్ట వాసులు పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..

- అట్టహాసంగా ప్రారంభమై మూతపడిన ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ స్టాల్



పూర్ణామార్కెట్ వద్ద మూతపడిన ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ స్టాల్

జగదాంబ: ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన స్టాల్ మూడునాళ్ల ముచ్చట అయిందని వినియోగదారులు అంటున్నారు. మానవవాళికి హాని చేసే ప్లాస్టిక్ కవర్లు వినియోగించకూడదంటూ జీవీఎంసీ అనేక కార్యాక్రమాలు చేపట్టి ఎట్టకేలకు కవర్ల నిషేధంపై విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జీవీఎంసీ ప్రజల సౌకర్యార్థం వ్యర్థాలతో తయారు చేసిన కవర్లు, జ్యూట్‌బ్యాగ్‌ల అమ్మకానికి ప్రధాన మార్కెట్లలో స్టాల్స్ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పూర్ణా మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన స్టాల్‌ను నగర మేయర్, నాటి కమిషనర్ కొన్ని రోజుల కిందట ప్రారంభించారు. అయితే జోనల్ స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా స్టాల్ నిర్వహణ మూడునాళ్ల ముచ్చటగా మారిందని ప్రజలంటున్నారు. గత కొద్ది రోజులుగా స్టాల్ తెరవడంలేదు. దీంతో ఈ ప్రాంతంలో ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా పెరిగినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించే దిశగా అడుగులు వేయాలని పలువురు కోరుతున్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన



పర్యావరణ పరిరక్షణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు, పిల్లలు

మురళీనగర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం మొక్కలు నాటడం, పెంచడంపై ఈస్ట్ పార్కులో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నెలవారీ సమావేశం ఏర్పాటు చేసి రానున్న నెలలో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 50 మంది మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నివారణ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వందన పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సిటీ టెర్రస్ గార్డెన్ సంస్థ ప్రతినిధులు ఆరవల అరుణ, మళ్ల సరిత, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షులు మాధవి, ఎం.భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, లీలా నాయుడు డైరెక్టర్లు ఎం.మహాలక్ష్మి, జి.మహాలక్ష్మి, జాయింట్ సెక్రటరీ ఎ.జయశ్రీ, కృష్ణవేణి, చిన్నారులు పాల్గొన్నారు.

సాగర తీరం పరిశుభ్రం

బీచ్‌రోడ్డు: సాగర తీరంలో పేరుకుపోయిన చెత్తను సెయింట్ ఆలోసియస్ ఆంగ్లో ఇండియన్ హైస్కూల్ విద్యార్థులు ఆదివారం తొలగించారు. అనంతరం ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ మరియదాస్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు తూట్లు

- క్లాప్ వాహనాలు పూర్తి స్థాయిలో తిరగటం లేదంటూ పలువురి విమర్శ



జోన్-4 పరిధి డంపింగ్ యార్డులో ఉన్న క్లాప్ వాహనాలు

జగదాంబ: జీవీఎంసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్లాప్ వాహనాల రాకపోకలకు సంబంధించి నిబంధనలు కచ్చితంగా అమలు కావడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటలకే క్లాప్ వాహనాలు కాలనీల్లోకి వెళ్లి చెత్త సేకరణలో భాగం కావాల్సి ఉంది. ఇందుకు గాను అవి రోజుకు 30 కిలోమీటర్ల మేర తిరిగి చెత్త సేకరించాలి. అనంతరం ఆ చెత్తను యార్డుకు తరలించాలి. అయితే ఉదయం 6 గంటల తర్వాత కూడా క్లాప్ వాహనాలు కాలనీల్లోకి వెళ్తున్నాయి. రూల్స్ ప్రకారం కాకుండా 7 నుంచి 8 కిలోమీటర్లు మాత్రమే తిరుగుతున్నట్లు సమాచారం. దీంతో చెత్త సేకరణ పూర్తిగా జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పాతనగరంలో ఎక్కువగా 35, 36, 37, 38 వార్డుల్లో క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పరిశీలన చేస్తే పూర్తి వివరాలు బయట పడతాయని అంటున్నారు. అదే విధంగా డంపింగ్ యార్డులో లాగ్‌బుక్‌లు పరిశీలిస్తే క్లాప్ వాహనాల రాకపోకలు, అవి సేకరిస్తున్న చెత్త గురించి తెలుస్తుందని పలువురు చెబుతున్నారు. జీవీఎంసీ కమిషనర్ దీనిపై దృష్టి సారిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దివ్యాంగ వ్యక్తి అదృశ్యం



అప్పలరాజు

సీతమ్మధార: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి ఐదు రోజులుగా తిరిగి రాకపోవడంతో అతడి సోదరి అనూషా ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ ధరేంద్ర కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతంపేట కనకమ్మ వారి వీధికి చెందిన జి.అప్పలరాజు(దివ్యాంగుడు) ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇంటికి వెళ్లి వెదికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం అప్పలరాజు సోదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతడు ఎక్కడైనా కనిపిస్తే 63051 87009, 85558 13894 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ ధర్మేంద్ర కోరారు.

మర్యాదపూర్వక కలయిక

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డిని ఆదివారం జోన్-3 మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు ఆయనకు అప్పారి కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



తోటగరువులో పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆప్‌కాస్ట్ ప్రతినిధులు, విద్యార్థులు

ఆరిలోవ : ప్రపంచ పర్యావణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో తోటగరువులో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ వేసవి క్రీడా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, ఆప్‌కాస్ట్ సభ్యులు కలసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తోటగరువు కూడలి వరకు పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ, ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆప్‌కాస్ట్ జిల్లా సమన్వయాధికారి పి.రాజారావు మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజలకు అవగాన పెంచేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాలుష్యం వల్ల పర్యావరణం నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించగలిగితే పర్యావరణాన్ని పరిరక్షించినట్లేనని పేర్కొన్నారు.

అనఘా లక్ష్మీదేవికి విశేష హారతులు



అమ్మవారికి నివేదించిన 108 రకాల ప్రసాదాలు



అమ్మవారికి హారతులిస్తున్న భక్తులు

అల్లిపురం: వివేకానందకాలనీలోని శ్రీ షిర్డీ సాయి దర్బార్‌లో వెలసిన శ్రీ అనఘా లక్ష్మీదేవి ఆలయ మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారి సన్నిదిలో వారాహి హోమం చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు చేంబోలు పవన్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు 108 రకాల ప్రసాదాలు నివేదన చేశారు. అనంతరం అమ్మవారికి ఏక హారతి, పంచ హారతి, సర్ప హారతి, సింహ హారతి, నక్షత్ర హారతితో పాటు ముత్యాల హారతి, పగడపు హారతి, దక్షిణ హారతి, నెమలి హారతి, అష్టలక్ష్మీ హారతి, చామంతి హారతి, గులాబీ హారతి, గాజుల హారతి, గోరింట హారతి తదితర 108 హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఏకాగ్రతతో అమ్మవారి నామ సంకీర్తన, మూల మంత్రాన్ని పటించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ధ నాగ జగదీష్ పర్యవేక్షించారు. మండుటెండలకు భక్తులు అవస్థలు పడ్డారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు ప్రత్యేక టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. వేకువ జాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ధ్వజస్తంభ పూజలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

పిల్లలకు పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన



బొమ్మలు తయారు చేస్తున్న చిన్నారులు



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో గోపీకృష్ణ

దాబాగార్డెన్స్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ఆదివారం పాఠశాల పిల్లలకు జిల్లా గ్రంథాలయ అధికారి రాజేంద్రవర్మ పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించారు. వివిధ రకాల బొమ్మలు తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చరిత్రకారుల జీవితాలు అధ్యయనం చేయాలి
అల్లిపురం: పిల్లలు చరిత్రకారుల జీవితాల గురించి తెలుసుకుని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఆయన విద్యార్థులకు పలు అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలు చదివి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అదే విధంగా విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలను కూడా చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రాజు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



టూటౌన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఈస్ట్ ఏసీపీ రమణమూర్తి, సీఐ తిరుమలరావు



వన్‌టౌన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రేవతమ్మ

అల్లిపురం : రౌడీ షీటర్లు శాంతి, భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు పీడీ యాక్ట్ అమలు చేసి నగర బహిష్కరణ విధిస్తామని పోలీసులు హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ ఆదేశాల మేరకు ఆదివారం నగరంలో అన్ని పోలీస్ స్టేషన్లలో ఏసీపీలు, సీఐలు ఆయా స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌటీ షీటర్లు, సస్పెక్టులు, పాత నేరస్తులను స్టేషన్లకు పిలిపించారు. వారి ప్రవర్తనపై ఆరా తీసి, ఏం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. చెడు అలవాట్లు విడనాడి, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

విజయవంతంగా సాయినాథుడి నామజపం



సాయినాథుడికి పూజలు చేస్తున్న నిర్వాహకులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయ ప్రాంగణంలో కొలువైన సాయినాథుని సన్నిధిలో శనివారం రాత్రి నుంచి నిర్వహిస్తున్న ఏకాహం ఆదివారం ఉదయం 6 గంటలకు ముగిసింది. రామాలయ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. గురు పౌర్ణమి రోజున నిర్వహించనున్న పూజా కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి చేయడానికి సాయినాథుడి కృప కోసం ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి అనే నామాన్ని 12 గంటల పాటు జపించారు. ముగింపు సందర్భంగా షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి పెంటకోట శ్రీనివాసరావు, అర్చకులు, రామశాస్త్రి, భానుమూర్తి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.